క్లుప్తంగా

ముగిసిన ఏపీఈఏపీ సెట్



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరుగుతున్న ఏపీఈఏపీ సెట్–2025 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 19న ప్రారంభమైన ఆన్‌లైన్ పరీక్షలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. మంగళవారం చివరి రోజు పరీక్షలకు 535 మందికి గాను 510 మంది విద్యార్థులు హాజరైనట్టు వెల్లడించారు. చీఫ్ సూపరింటెండ్‌గా ప్రో వైస్ చాన్సలర్ ఆదిరెడ్డి రమేష్, కో ఆర్డినేటర్లుగా ఎం.రాజబాబు, టి.శ్రీనివాసులు, వీర ప్రసాద్ వ్యవహరించినట్టు పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపిఈఏపి సెట్–2025 పరీక్షలు ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి మాట్లాడుతు పిల్లల బంగారు భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. వారి నిర్ణయాలకు అనుగుణంగా మద్దతూ పలుకుతూ ఆయా రంగాల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా విధులకు..



గండేపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కంప్యూటర్ల విభాగం

గండేపల్లి: గండేపల్లి రెవెన్యూ సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరుకాక పోవడంతో మండల ప్రజలు మండిపడుతున్నారు. వివిధ అవసరాలపై కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో దిక్కుతోచక అధికారులు వచ్చే వరకు వేచి ఉంటున్నామన్నారు. అధికారుల రాకకోసం తెలుసుకునే ప్రయత్నం చేద్దామన్నా సరైన సమాచారం తెలిపే నాధుడే కార్యాలయం వద్ద కరవయ్యాడని ప్రజలు వాపోతున్నారు. కింది స్థాయి నుంచి పై స్థాయి ఉద్యోగి వరకు సమయానికి రాకపోవడం కూలీపనులు, వ్యవసాయం పనులు మానుకుని రోజంతా రెవెన్యూ కార్యాలయం వద్దే వేచి ఉండాల్సి వస్తుందన్నారు. మంగళవారం గం.10.30 సమయం కావస్తున్నప్పటికి కంప్యూటర్స్ రూంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

విధుల్లోకి తీసుకోవాలి



శంఖవరం ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో నిరాహార దీక్ష చేస్తున్న బాధితురాలు పద్మ, సభ్యులు

శంఖవరం: అక్రమంగా తొలగించిన అంగన్వాడీ కార్యకర్తను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రం శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎదుట మంగళవారం శంఖవరం, రౌతులపూడి మండలాల అంగన్వాడీ కార్యకర్తలు నిరహర దీక్ష చేట్టారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ రౌతులపూడి మండలం రామకృష్ణాపురం అంగన్వాడీ కార్యాలయంలో ఎం.పద్మ విధులు నిర్వహిస్తుండగా అక్రమంగా తొలగించారన్నారు. సీడీపీఓ పద్మావతి ఎటువంటి షోకాజ్ నోటిసులు ఇవ్వకుండా కార్యకర్తను తొలగించారన్నారు. నాలుగు సార్లు జిల్లా కలక్టర్‌కు వినతి పత్రం అందజేసిన న్యాయం జరగలేదన్నారు. బాధితురాలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

కిర్లంపూడి: సైబర్ నేరాల పట్ల బాలికలు అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ ఎం.పూర్ణిమ సూచించారు. గోనేడ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిషోరి వికాసం వేసవి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి పలు అంశాలను బాలికలకు, తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ సోషల్ మీడియాలో పరిచయమైన అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని చేరవేయకూడదన్నారు. అసభ్యపదజాలం ఉపయోగించడం ప్రమాదకరమని, ఎవరైనా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు అనిపిస్తే టోల్ ఫ్రి నెంబర్ 1930 కాల్ చేయి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి సైబర్ నేరాల పట్ల జరిగే అనార్థాలను ప్రజలకు వివరించారు. సూపర్‌వైజర్ కరీమునిష, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పలకరించిన తొలకరి.. చిగురించిన ఆశలు

- మెట్టలో ఖరీఫ్ ఆశలు సజీవం
- వర్షంతో వరి, పత్తి పంటలకు మేలు
- రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి



కోటనందూరు మండలంలో బోరుబావి దగ్గర వేసిన వరి నారుమడి

తుని: నైరుతి ముందుగానే ప్రవేశించడంతో వేసవిలో సైతం వరుణుడు కరుణించి వర్షాలు కురిపించడంతో రైతులు తొలకరి ముందుగానే పలకరించిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెట్టకు ఆయువు పట్టుగా ఉన్న పంపా, తాండవ, ఏలేరు జలాయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు సమృద్ధిగా కనిపించడంతో రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. కురిసిన వర్షాలకు బోరు బావులు ఉన్న చోట ఖరీఫ్‌కు సంబంధించి వరి నారుమడులు వేశారు. ఇవి కూడా ఎండల తీవ్రతకు ఎదుగుదల లేక పోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇటువంటి సమయంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు చిగురింప చేశాయి. ఇప్పటికే కూరగాయులు, వాణిజ్య పంటలకు వర్షం మేలు చేసింది. ఇదే విధంగా వర్షాలు పడితే ఖరీఫ్‌కు డోకా ఉండదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ప్రధాన పంటగా వరిని సాగు చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం మేర నారు మళ్లు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, మెట్ట భూముల్లో నారుమళ్లు వేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. గత ఏడాదితో పోల్చితే వర్షాలు తక్కువ శాతం కురిశాయి. అన్ని అనుకూలిస్తే జూలై, ఆగస్టులో వరి నాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పంపా, తాండవ జలాశయాల్లో ఆశాజనకంగా నీటి నిల్వలు ఉన్నాయి. ఏలేరు జలాశయానికి గోదావరి జలాలను విడుదల చేయడంతో రైతులు వరి సాగుకు శ్రీకారం చుట్టారు. ఇక పుష్కర కాలువకు జూన్ నెలఖారున నీటిని విడుదల చేయడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. దింతో జగ్గంపేట నుంచి తుని వరకు పుష్కర ఆయుకట్టుకు నీరు లభించనుండటంతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు.

ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల కోసం నిరీక్షణ:

తాండవ, పంపా ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. తాండవ గరిష్ట నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 342.8 అడుగులు ఉంది. 370 అడుగులకు చేరితే నీటి విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. క్యాచ్ మెంట్ ఏరియా పుష్కలంగా వర్షాలు కురిస్తే ఇన్‌ఫ్లో పెరుగుతుంది. దింతో ఆయుకట్టుకు నీటిని విడుదల చేసేందుకు త్వరలో రైతులతో సమావేశం నిర్వహిస్తామని ప్రాజెక్టు కమిటీ చెబుతున్నారు. పంపా ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 105 అడుగులు కాగా ప్రస్తుతం 91 అడుగులు ఉంది. వంద అడుగులకు చేరితే నీటిని విడుదల చేస్తారు. ఆయుకట్టు పరిధిలో 12,500 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం ఉంది. భారీ వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సీజన్ గట్టెక్కుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇది ఇలా ఉంటే వర్షాభవం వలన రైతులు మిశ్రమ పంటల సాగు వైపు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గం	వరి విస్తీర్ణం ఎకరాల్లో
తుని	28,000
ప్రత్తిపాడు	25,000
జగ్గంపేట	42,000

వరి నారు వేశాను



బోరుబావి నీటి లభ్యత ఉన్న భూములో వరి నారు వేశాను. ప్రస్తుతం కురిసిన వర్షాలకు నారుమళ్లు పెరుగుదల బాగుంది. పూర్తి స్థాయిలో నీటి లభ్యత వస్తేనే వరి సాగుకు అనుకూలత లభిస్తుంది. ప్రభుత్వం స్పందించి ఏలేరు జలాశయం నుంచి పంపాకు నీటిని విడుదల చేస్తే పూర్తి స్థాయిలో పంటల సాగు అవకాశం కలుగుతుంది. ప్రజా ప్రతినిధులు రైతుల పరిస్థితిని గమనించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి.

పోల్నాటి మాణిక్యాలరావు, రైతు, తుని మండలం

విత్తనాలు సిద్ధం చేస్తున్నాం



ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమైన పత్తి, వరి విత్తనాలను సిద్ధం చేస్తున్నాం. ఇందుకు అవసరమైన ప్రణాళికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. రైతులు పంట మార్పిడి విధానం అవలింబించాలి. ముఖ్యంగా మెట్ట ప్రాంతంలో పత్తికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృషిట్ సారించాలి. రైతులు విత్తన ఎంపిక విషయంలో వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.

సుంకర బుల్లిబాబు. ఏడిఏ,తుని

11కేవీ లైన్‌ను తొలగించాలి



కాండ్రేగులలో ఎలక్ట్రికల్ ఏఈ మాధురిని చుట్టుముట్టిన మహిళలు

జగ్గంపేట: జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలోని జనావాసాల మీదుగా ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌ను ఊరి చివర నుంచి వెళ్లేలా మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అయితే అధికారులు విద్యుత్ లైన్ మార్చకుండా ఎత్తు పెంచే చర్యలు చేపడుతున్నారని తెలిసి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వినాయక వీధిలో మేడలమీద వారికి 11కేవీ లైన్లు చేతికి తగులుతున్నాయని, గతంలో ఇక్కడ విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి చెందారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంగళవారం విద్యుత్ లైను పరిశీలనకు వచ్చిన ఎలక్ట్రికల్ ఏఈ మాధురిని మహిళలు చుట్టుముట్టారు. గతంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఇదే సమస్యపై డీఈ ఈఈకి వివరించారని అయినా ఇప్పటి వరకూ చర్యలు చేపట్టలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వీధిలోంచి లైను తొలగించవలసిందేనని మహిళలు పట్టుబడుతున్నారు.

ఇదే విషయమై ఎలక్ట్రికల్ ఏఈ మాధురిని వివరణ కోరగా కాండ్రేగులలో మహిళల చెప్పిన సమస్య నిజమేనన్నారు. అయితే దీన్ని పరిష్కరించడానికి గ్రామ పంచాయితీ పాలకవర్గంతోను, అధికారులతోను మాట్లాడామని, వారు సహకరిస్తే లైను మార్చే చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం



ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో అధికారుల మానవహారం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సచివాలయ సిబ్బందికి యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు ప్రారంభించి, మాట్లాడుతూ సమాజంలో ఒత్తిడిని అధిగమించేందుకు అన్ని వర్గాల వారు యోగా అనువైన మార్గమన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న సచివాలయాల సిబ్బంది గ్రామాల్లో యోగాంధ్ర ప్రచారంలో పాల్గొనాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు అన్నారు. యోగా నిపుణులు దొడ్డిపట్ల సోమన్నదొర, అల్లూరి అంజనాదేవి యోగాసనాలపై అవగాహన కల్పించారు. సూర్య నమస్కారాల విశిష్టతను వివరించారు. ఈశిక్షణా తరగతుల్లో డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీవిశ్వనాధంతో పాటు సుమారు 50 మంది సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ, మానవహారం

యోగాంధ్రపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ప్రత్తిపాడులో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్, మార్కెట్ మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్‌కు చేరుకుంది. జంక్షన్‌లో మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడిలో..

కిర్లంపూడి: యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సత్యదేవా కళ్యాణ మండపం వద్ద మంగళవారం 250 మంది సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. యోగ ట్రైనర్లు బావిశెట్టి లక్ష్మీనారాయణ, పి.అమృత, పద్మరాజు, ఎస్.వెంకటరమణ ప్రథమిక వ్యాయమాలు, ఆసనాలు, ప్రాణాయామం వంటి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ హరికృష్ణ, ఎంఈఓ టి.జోసఫ్, ఆయుష్ అధికారి జె.మాధురి, డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్, ఏఎన్ఎంలు ఉన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ ఇస్తున్న అధికారులు

గండేపల్లిలో..

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ రాజమనోహర్ తెలిపారు. యోగాంధ్ర–2025లో భాగంగా జూన్ 21 వరకు యోగా మాసాన్ని నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. గ్రామ స్థాయి శిక్షకులకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించడం జరిగిందని, ఈనెల 30 వరకు షెడ్యూల్ ప్రకారం ఉదయం 7.గంటల నుంచి 8.గంటల వరకు మండల, గ్రామ స్థాయిలో యోగాపై అవసరమైన శిక్షణ టీఓటీలతో ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి బ్యాచ్‌లో ఏఓకె చంద్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన పేర్కొన్నారు.

అనాథ పిల్లలకు ఆధార్ నమోదు



జగ్గంపేటలో ఆధార్ నమోదు చేస్తున్న అధికారులు, న్యాయవాదుల కమిటీ

జగ్గంపేట: భారతదేశంలో అనాధ, నిరాశ్రయ పిల్లలకు 18 సంవత్సరాలు దాటిన వారికి ఆధార్ నమోదు చేసే కార్యక్రమం సాతి జగ్గంపేటలో మంగళవారం నిర్వహించారు. నిరాశ్రయ పిల్లలకు, కుటుంబాలకు ఆధార్ నమోదు చేసి వారి న్యాయ సహాయం, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించే విధంగా పెద్దాపరం కోర్టు మండల న్యాయసేవ అధికారి కమిటీ ఛైర్మన్, 7వ జిల్లా కోర్టు జడ్జి జి.చంద్రమౌళేశ్వరి న్యాయవాదులు, పారలీగల్ టీమ్‌తో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో ఈ కమిటీ స్థానిక సంత మార్కెట్ తదితర ప్రాంతాలలో తిరిగి గత 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ముస్లిం కుటుంబాలను గుర్తించి వారికి ఆధార్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ జగ్గంపేట, గండేపల్లి మండలాలలో ఆధార్ నమోదు చేసుకోని నిరుపేద కుటుంబాలు వుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టి.రఘునాధరావు, న్యాయవాదుల మడికి రాంబాబు, గణేష్, పారా లీగల్ వాలంటీర్లు, జిల్లా వక్ఫబోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు ప్రత్యంగిర హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి వైశాఖ అమావాశ్య పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేసిననంతరం పండితులు ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. 11. గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ప్రత్యంగిర హోమం, పూజ కార్యక్రమాలను వేద పండితులు యనమండ్ర శర్మ ఘనపాఠీ, వనదుర్గ అర్చకుడు కోట వంశీ, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, మరో 25మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

కారుమబ్బులు కమ్ముకున్న వేళ..



ప్రత్తిపాడు: ఉదయం నుంచీ సూర్యభగవానుడు కన్నెర్ర చేస్తే..సాయంత్రం వేళ మబ్బులు కమ్మేసాయి. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు రుతు పవనాల రాక కొంత ఊరటనిచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వాతవరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. నల్లటి కారు మబ్బులు ఆకాశాన్ని కమ్మేయగా, ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు వీయడంతో వాతావరం అహ్లాదకరంగా మారి మైమరపించింది.

రాష్ట్ర కమిటీల్లో స్థానం



రామకుర్తి జగదీశ్వరరావు (ఫైల్)



బండారు వీడీవీ ప్రసాద్ (ఫైల్)

గోకవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో జగ్గంపేట నియోజకవర్గంకు చెందిన ఇరువురికి చోటు దక్కింది. జగ్గంపేటకు చెందిన రామకుర్తి జగదీశ్వరరావు, కిర్లంపూడికి చెందిన బండారు విడివి ప్రసాద్‌లను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహంలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీలో యువతకు సముచిత స్థానం



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన ఒమ్మంగి యువత

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీలోనే యువతకు సముచిత స్థానం దక్కుతుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో– ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని పార్టీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును నియోజకవర్గంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన పలువురు యువకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో యువతకు ఎంతో ప్రధాన్యత కల్పించడం జరిగిందన్నారు. నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి భారీ ఎత్తున ముందుకు రావాలని యువతకు పిలుపునిచ్చారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రామిశెట్టి నాని, చుక్కా రమణ, చింతపల్లి ఏసు, దారా నూకరాజు, తిరగటి రాజా ఉన్నారు.

కష్టపడితే సముచిత స్థానం



మైనర్ బాబును సత్కరిస్తున్న తోట నరసింహం, రాంజీ

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన మడికి మైనర్‌బాబు కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ సెక్రటరీగా నియమితులైయ్యారు. మంగళవారం వీరవరంలోని తోట నరసింహం నివాసంలో ఆయనను, యువ నాయకుడు తోట రాంజీని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మైనర్ బాబుకు సాల్వా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ పార్టీ తమపై పెట్టిన బాధ్యతలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రభుత్వం సముచిత స్థానం కలిస్తుందన్నారు. వంగలపూడి శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మృతదేహాలను అప్పగించాలి



రంగవల్లి నగర్‌లో రైతు కూలీసంఘం నిరసన

జగ్గంపేట: ఆపరేషన్ కగార్ పేరుతో హత్యగావింపబడిన మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతో సహా 27మంది మృతదేహాలను వారి కుటుంబాలకు తక్షణం అప్పగించాలని డిమాండ్ చేస్తు జగ్గంపేటలో రైతు కూలీసంఘం నిరశన కార్యక్రమాన్ని నిర్వహించింది. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా కేశవరావుతో సహా హత్యగావింపబడిన 27మంది మావోయిస్టు నేతలకు నివాళులురిస్తు రెండు నిమషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు మాట్లాడుతూ మావోయిస్టులను కగార్ పేరుతో రాజ్య హత్య చేసిన ప్రభుత్వం మృతదేహాలను సైతం వారి కుటంబాలకు ఇవ్వకపోవడం దుర్మార్గపు చర్యన్నారు. దీనిపై సుప్రీంకోర్టు స్వతంత్ర న్యాయ కమిషన్ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను భేషరతుగా నిలిపివేసి మావోయిస్టులతో చర్యలకు సిద్ధపడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఎఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ ,మహిళా నాయుకురాలు రెడ్డి దేవి తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం సీజ్

- వేములపాలెంలో 40 లీటర్ల సారా స్వాధీనం
- ఇద్దరి అరెస్టు, మరో ముగ్గురిపై కేసు నమోదు



నల్లబెల్లం లోడుతో ఉన్న ఆటోను స్వాధీనం చేసుకున్న ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు

ప్రత్తిపాడు: మండలంలోని వేములపాలెం గ్రామంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లంతో పాటు 420 లీటర్ల సారాను ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ శివ ప్రసాద్ కథనం ప్రకారం..తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పురుషోత్తవ రాజబాబు, గుడివాడ శ్రీనివాసరావులు వేములపాలెం గ్రామంలో ఆటోలో అక్రమంగా నల్లబెల్లం రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకుని, ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. 500 కేజీల నల్లబెల్లం , 40 లీటర్ల సారా ఉండటంతో ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నల్లబెల్లం క్రయవిక్రయాలపై వారిని విచారించగా వేములపాలెంకు చెందిన తుట్టా అప్పలరాజు, తుట్లా అర్జున్, ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన బాదం సుబ్బారావులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. తనిఖీల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

వైభవంగా నేరేళ్లమ్మతల్లి జాతర

- 30 సంవత్సరాలుగా జాతర నిర్వహణ
- సత్యదేవుని కంటే ముందుగా వెలసినట్లు ఆధారాలు



నేరేళ్లమ్మ సేవలో వైఎస్సార్ సీపీ నర్సాపురం లోక్‌సభ పరిశీలకుడు ముదునూరి

అన్నవరం: స్థానిక గ్రామ దేవత శ్రీ నేరేళ్లమ్మ తల్లికి గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు వైశాఖ అమావాశ్యతో మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి నేరేళ్లమ్మ వారిని పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు కలిసి నివేదనలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నేరేళ్లమ్మ వారిని రాత్రి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అన్నవరం దేవస్థానం ఏఈఓ కే కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సత్యదేవుని కన్నా ముందే ఆవిర్భావం

సత్యదేవుని ఆవిర్భావంకు ముందు నుంచే గ్రామంలో శ్రీ నేరేళ్లమ్మ తల్లి వెలిసినట్లు ఛారిత్రక ఆధారాలున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అన్నవరం దేవస్థానం చరిత్రలో కూడా శ్రీనేరేళ్లమ్మ తల్లి ప్రస్తావన ఉంది. గతంలో ఈ ఆలయ నిర్వహణను పురగిరి క్షత్రియలతో కూడిన కమిటీ నిర్వహించేది. అయితే రత్నగిరి దేవస్థానం ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకుని నూతన ఆలయం నిర్మించి గత 30 సంవత్సరాలుగా ఈ జాతర నిర్వహిస్తోంది. సత్యదేవునికి ఆడపడుచుగా నేరేళ్లమ్మతల్లిని పుట్టింటి మర్యాద చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా అమ్మవారికి రత్నగిరి దేవస్థానం నుంచి సారె, చీర సమర్పించారు.

అమ్మవారిని దర్శించిన ముదునూరి

వైఎస్సార్ సీపీ నాయకుడు, పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం లోక్‌సభ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు మంగళవారం సాయంత్రం నేరేళ్లమ్మను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీకి రూ.ఐదువేలు విరాళం అందచేశారు. ఆలయ అధికారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

తొండంగిలో..

తొండంగి: మండలంలోని గోపాలపట్నం గ్రామంలోని గ్రామదేవత నేరేళ్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రధాన ఆలయంలో పంచామృతాభిషేకం, సప్త నదీ జలాల అభిషేకం నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన స్తోత్ర శతనామ పూజలు నిర్వహించారు.